

# భోజనం

తెనాలి సుశీలాదేవి

ఉస్సురంటూ పడక కుర్చీలో కూలబడి తుండు తీసుకుని ముఖం తుడుచుకున్నాడు రామశాస్త్రి.

మంచినీళ్ళు తెచ్చింది జగదాంబ. గ్లాసు అందుకుంటూ యిల్లంతా కలయ జూశాడు ఆయన.

"సాయి ఏదీ కనబడలేదూ" భార్యకేసి ప్రశ్నార్థకంగా చూస్తూ అన్నాడు. ఆ వేళకు వాడు దీపం ముందు కూర్చుని చదువుకుంటూండడం రివాజు.

"నిక్షేపంలా వున్నాడు. మీరు ఊళ్ళో లేరు కదూ. యింకేం పుస్తకాలు గూటికే అప్పజెప్పేసి శయనోత్సవానికి వెళ్ళివుంటాడు. సరి .... సరి .... మీరు రండి వడ్డిస్తున్నాను" మూతితిప్పుకుంటూ విసవిసా వంటింటికేసి వెళ్ళిపోయింది జగదాంబ.

చివుక్కుమంది రామశాస్త్రికి.

'ఊఁ' ఆయన గుండెలు చీల్చుకుంటూ నిట్టూర్పు బయటికి వచ్చింది.

పనిమీద వూరు విడిచి వెళ్ళి రెండు రోజులయింది. యిప్పుడే వచ్చాడు. సాయిని పలకరించాలని వుంది ఆయనకి. ఇంటికి రాగానే భార్యతో ఛీత్కారా లెందుకని పలకరింపు వాయిదా వేసుకుని కుర్చీలోంచి లేచాడు. వంటింటివేపు వెళ్ళబోతూ గదిలోకి తొంగిచూశాడు. ఆయన గుండె పిండినట్టయింది. గబగబా గదిలోకి వచ్చాడు.

గుడ్డిదీపం వెలుతురులో ....

'నాయనా .... శేషసాయీ ....'వంగి వీపుమీద తట్టాడు.

గదిలో చిరిగిన చాపమీద ముడుక్కుని పడుకుని వున్నాడు శేషసాయి. మోకాళ్ళు ముడుచుకుని, మోచేతులు పొత్తికడుపులోకి దూర్చుకుని వణుకుతున్నాడు. పలకలేదు. కనీసం కళ్ళు తెరిచయినా చూడలేదు.

చొక్కా పైకి మడిచి వీపు మీద చేయివేసి చూశాడు రామశాస్త్రి. పెనంమీద వేసినట్టయింది.

ఆదుర్దాగా రెండుమార్లు తట్టి పిల్చాడు.

మేనమామ కంఠం విన్న సాయి కళ్ళు తెరవాలని ప్రయత్నించాడు. కాని అది విఫలప్రయత్నమే అయింది.

"జగదా.... జగదా..."అక్కడినుండే గట్టిగా పిలిచాడు.

"అబ్బ ఎందు కంతలా గొంతు చించుకున్నట్టు అరుస్తారు" మాటతోనే వచ్చింది జగదాంబ.

"మీకోసం అన్నం వడ్డించి అక్కడ నేను కాచుకుని వుంటే యింతలో ఏదో మునిగిపోతున్నట్టు మీ రిక్కడ చేరి...."

"చాలుగానీ సాయికి జ్వరంతో ఒళ్లు పేలిపోతుంది. రాగానే నాతో అనలేదేం? ఎప్పట్నుంచీ జ్వరం? అసలు నువ్వు చూశావా...."

"ఆ.... సాయంత్రం చూశాను."పొడి పొడిగా అంది జగదాంబ.

"మరి కషాయమన్నా కాచి ఇచ్చావా?"

"లేదు. వాడు కళ్ళయినా తెరవండే. ఈమాత్రానికి అంత గాభరా ఏమిటి? మీరు ముందు భోజనానికి రండి పొద్దు పోయింది." విసుగ్గా అసహనంగా కదిలింది జగదాంబ.

"ఇదుగో కాసిని వేన్నీళ్ళు పెట్టు ముందు."

"నా ఖర్మ" అంటూ కుంపట్లో బొగ్గులు రాజేయసాగింది.

ఆ వూళ్ళో ఆసుపత్రిలేదు. డాక్టరూ లేడు. అంతో యింతో వైద్యం తెలిసిన రామశాస్త్రి ఆ వూరి జనానికి రక్ష. పౌరోహిత్యమూ, వైద్యమూ అతనికి అచ్చి వచ్చాయి. లోటులేకుండా జరిగి పోతుంది.

"ఇదిగోండి నీళ్ళు."

ఏదో చూర్ణాన్ని ఆ నీళ్ళలో కలిపి సాయిని లేపాలని చూశాడు రామశాస్త్రి. వాడికి ఒంటిమీద స్మారకంలేదు.

ఆ పిల్లాడిని ఒళ్ళో పడుకోబెట్టుకొని ఎడమచేత్తో బలవంతాన వాడినోరు తెరిచి మందు నోట్లో పోశాడు రామశాస్త్రి.

సగం లోపలికి సగం బయటికి వచ్చేసింది మందు. తుండుతో వాడి మూతంతా తుడిచి వాడి పక్క విదిలించి పరిచి, చాపమీదినుంచి వాడిని లేవనెత్తి పరుపు మీద పడుకోబెట్టి దుప్పటి కప్పాడు.

"ఇక వస్తారా"

భార్య కంఠంలో విసుగుదల అతనికి అర్థమయింది. మరేం మాట్లాడకుండా భోజనానికి కదిలాడు.

రామశాస్త్రి మనసు వికలమయింది. ముద్ద దిగటంలేదు. అతను వూళ్లోలేని యీ రెండు రోజులూ జరిగిందంతా ఆవేశంతో, ఆక్రోశంతో అతడికి వివరిస్తోంది జగదాంబ. ఒకవిధంగా గుండెల్లో మెరమెరలాడుతున్న కోపాన్ని బయటికి వెళ్ళగక్కుతోంది.

మౌనంగా ఆ మాటలన్నీ విన్నాడు. నోరు మెదపకుండా ఆ కోపాన్ని భరించాడు. భోజనం ముగించి వచ్చి సాయి దగ్గరకు వెళ్ళాడు. కదలకుండా పడి వున్నవాడిని రెండు క్షణాలు అలాగే చూశాడు. ఆయన కనుకొలకుల్లోంచి రాలిన కన్నీటిబొట్లు వాడి తలమీద పడ్డాయి. గిరుక్కున తిరిగి వెళ్ళి వీధిలో మంచంమీద పడుకున్నాడు.

జగదాంబ తలుపులు వేసుకుని మంచి నీళ్ళు పట్టుకుని వచ్చి తన మంచం క్రిందికి పెట్టి తన పడకమీద కూర్చుంది.

'ఇంత లేదు వెధవ పీడకి....'

వంగి రామశాస్త్రి ముఖంలోకిచూసింది. కళ్ళు మూసుకుని కదలకుండా పడుకుని వున్నాడు.

"అయ్యో రాత. దిండు వాసన చూడకూడదు. అప్పుడే నిద్ర. హూ...."

ప్రక్కకు తిరిగి నిద్రకు ఒరిగింది.

మేలుకుని వుండి ఆవిడ మాటలు వినేఓర్పు లేదు రామశాస్త్రిలో. అందుకనే కళ్ళు మూసుకున్నాడు. కాని....ఆ మూసిన రెప్పల వెనుక... ఆ కళ్ళలో కదలిపోతున్న చిత్రాలు.

"అన్నయ్యా! దేశాలు విడిచి ఆయన ఎక్కడకు వెళ్ళాడో, ఏ సన్యాసుల్లో కలిశాడో. నాకు తెలియలేదు. వీణ్ణి చూసుకునే నా మోడు బ్రతుకు యీడ్చుకుంటూ వచ్చాను. యీనాడు నేనూ వాడిని దిక్కులేని వాడిగా చేస్తున్నాను. నా రోగం నన్ను తినేసింది. నా తరువాత వీడి గతి ఏమవుతుందో...."

మంచానికి అంటుకుపోయిన ఒక్కగానొక్క చెల్లెలిని చూసి రామశాస్త్రి కళ్లు చెరువులే అయ్యాయి.

"తల్లి తరువాత తల్లి అంతటివాడు మేనమామ అన్నారు. నేను వున్నాను పార్వతీ ...." కంఠం రుద్ధమయి పోతుండగా అన్నాడు రామశాస్త్రి.

"కాని....వదిన...."

"యీ అన్నయ్య మీద నమ్మకం వుంచమ్మా. వాడికి నాకున్నంతలో యే లోటూ రానీయను. యిక వాడు నాకు మేనల్లుడు కాడు. 'సాయి' నా కొడుకు. సరేనా?"

చివరి క్షణాల్లో చెల్లెలు ఆత్మశాంతి కోసం ప్రమాణం చేశాడు.

తల్లిని తీసుకుపోతుంటే గిలగిలా కొట్టుకొంటున్న సాయిని గుండెలకు పొదువుకున్నాడు....ఆ తరవాత....తరువాత....అశాంతిలోనే కలత నిద్ర. నిద్రలోనే ఏడుస్తున్నాడు రామశాస్త్రి.

మేనల్లుడిని వెంటబెట్టుకు వచ్చిన రామశాస్త్రిని చూసి మూతి ముప్పయి వంకరలు తిప్పింది జగదాంబ.

"ఈ పీడ మనకు తగులుకుందన్న మాట"

ఆ ఒక్కమాటతోనే జగదాంబ అంతర్యం అవగతమైపోయింది. అయినా తను సాయిని చేరదీయక తప్పదు. కష్టమో, సుఖమో వాడు తనతో వుండాల్సిందే.

ఈ మాటే గట్టిగా నిశ్చయంగా భార్యకు చెప్పాడు రామశాస్త్రి. నెమ్మదిగా ఓ దా ర్పు గా .... సర్దుకుపోవలసిందిగా మేనల్లుడికి చెప్పాడు.

పన్నెండేళ్ళ సాయి కూడా గ్రహించలేకపోలేదు.

తన తల్లి మనసుకు శాంతిని ప్రసాదించి, తనను అక్కున చేర్చుకుని వెంట తీసుకువచ్చిన మేనమామమీది భక్తితో పాటు తన ముఖం చూసిన క్షణంలోనే అన్న ఆ ఒక్కమాటతోనూ తనమీద నిరసన ప్రకటించిన అత్త అంటే భయమూ వాడి గుండెల్లో చోటుచేసుకున్నాయి. తగిన ఆదరణ వాడికి లభిస్తుందని రామశాస్త్రి ఆశించలేదుగానీ మరీ వాడిని నౌఖరులా చూస్తుందని మాత్రం అనుకోలేదు. ఏ విషయంలోనయినా ఆవిడతో వాదోపవాదాలకు దిగితే మాత్రం అసలుకే మోసం వస్తుందనే సంగతి ఆయనకి అనుభవైకవేద్యం.

వాడిమీదకీ కోపమో, తమకు జంఝాటం తగిలించి హాయిగా చెల్లుకున్న ఆడపడుచు మీది ఆగ్రహమో కాని ఫలితం రెండు మూడురోజుల కోసారయినా పస్తు పడుకోవలసివచ్చేది సాయి.

తనను పస్తు పెట్టటానికి కారణ మేమిటి.... తనవల్ల జరిగిన తప్పిదమే మిటో వాడికి తెలిసేదికాదు.

"వెధవా! నీ కీ రోజు అన్నంలేదు. ఒకపూట మాడితేగానీ నీ పొగరు కరగదు. ఆ మహాతల్లి చచ్చి ఎక్కడ ఉందోగానీ దాని పీడ మాత్రం మమ్మల్ని తగులుకుంది. పనీ, పాటా లేకపోయివా మూడుపూటలా తిని తెగబలిసి...."

యిన్ని దీవెనలలోనూ వాడికి అర్ధ మయ్యేది ఒక్కటే 'నీ కీ పూట అన్నం లేదు' కడుపులో కాళ్ళు దూర్చుకుని పడుకుంటే కన్నీళ్ళు వాడికి తెలియ కుండానే కారిపోయేవి. కలలో వాళ్ళ అమ్మ కనిపించేది.

"బాబూ! సాయీ అన్నానికి రా నాయనా"

"నా కొద్దు పో" కడుపులో ఎలకలు పరుగెడుతున్నా బింకంగా అనేవాడు.

"ఎందుకురా సాయీ...నామీద కోపం వచ్చిందా. అమ్మమీద కోపం వస్తే అన్నమేం చేసిందిరా. తినేసి తరువాత తీరిగ్గా అలుగుదువుగానీ రా తండ్రీ. అలాగే నిద్రపోయావంటే యీ చిన్న పొట్ట ఆకలిగొంటుందిరా."


"నా కక్కరలే దన్నానా."

"సరే. ఏంచేస్తాను నాయనా. నాకూ వద్దులే అయితే."

అంతే! ఆ మాటతో తాను అమ్మ కోపం వెడుతున్నట్టుగా బలవంతంగా తింటున్నట్టుగా సుష్టుగాగా తినేసేవాడు.

అమ్మ కళ్ళలో మిలమిల మెరుపు. వాడిన ఆమె ముఖంలో ఆ మెరుపుల వెలుగు.

"ఏదీ.... యిప్పుడేది అమ్మ....




అమ్మా.... అ....మ్మా.... ఎక్క డున్నావే! ఒక్కపూట కాదు. ఎన్నో పూటలు అన్నం లేదమ్మా! అన్నం తినకుండా ఆకలితో పడుకుంటే నిద్ర రాకుండా ఏడుపే వస్తుందే. ఏడుస్తున్న నా కళ్ళలో మెదులుతావేగానీ కనబడవేం అమ్మా.... సాయి పసి గుండెల్లో కొండంత ఆవేదన. అయినా ఏనాడూ ఏదీ నోరువిప్పి మామకు చెప్పలేక పోయేవాడు. ఆయన పలకరించినపుడు 'ఆకలేస్తోంది మావయ్యా' అనే మాట పెదవుల చివరదాకా వచ్చేది. కాని భయం వాడి నోరు నొక్కేస్తుంది. ఏం చెబితే ఏమొస్తుంది. ననే పిరికితనం వాడిలో పేరుకుపోయింది.

ఎప్పుడయినా రామశాస్త్రి బ్రాహ్మ నార్థము ఎవరింటికయినా వెళ్ళినపుడు ఆయన వెంట తీసుకువచ్చే గారెలు, బూరెలు మూటవిప్పి ముందుగా వాడికే యిచ్చేవారు. అలాంటిరోజు సాయికి పండగలా వుండేది. జగదాంబ రుసరుస లాడేది కానీ ఆ సంతోషంలో అదేమీ పట్టించుకునేవాడు కాదు సాయి.

రామశాస్త్రి యింట్లో వుండటం తక్కువ. రోజూ ఏదో పనిమీద పొరుగూళ్ళకి పెళ్ళిళ్ళకీ, తద్దినాలకీ, వైద్యానికీ, తిరుగుతూనే వుండేవాడు. యింట్లో వున్నప్పుడు మాత్రం సాయిని తనతోనే భోజనానికి కూర్చోబెట్టు కోవాలని వుండేది ఆయనకి. కాని వాడికి బడి వుండేది కనుక రాత్రిల్లు మాత్రమే కుదిరేది. అలాంటి రాత్రిళ్లు సాయికి సంతోషంగా వుండేది. హాయిగా వుండేది. మామ ప్రక్కన కూర్చుని తృప్తిగా తినేవాడు. అలాంటి రోజు ఎప్పుడోగానీ వచ్చేదికాదు పాపం.

ఆ వేళ.... వుదయం.

రామశాస్త్రి అత్యవసరమైన పనిమీద తన బావమరిది వూరికి వెళ్లాడు. సాయికి ఆవేళ బడి లేదు.

జగదాంబ వంట చేసి పెట్టి వీధి అరుగుమీద చేరి పొరుగింటావిడతో పిచ్చాపాటి సాగిస్తోంది. ఏ వేళకీ లేవదు.

సాయికి ఆకలితో నీరసం వస్తోంది. అయినా అడగటానికి భయం. హాలులో

చదువుతూ కూర్చున్నాడు. యిక ఆకలికి ఆగలేక నీరసం ముంచుకు రాగా చదువుతున్న పుస్తకాలు మూసేశాడు. అలాగే చాపమీద వాలిపోయాడు. ఆ నీరసం మీద ఎప్పుడు కునుకు పట్టిందో వాడికే తెలియదు.

ఛెళ్ళున వీపుమీదచరుపు. అదిరిపోయి లేచి కూర్చున్నాడు.

"చెప్పు వెధవా....రా .... యిలా... రా.... చూడు నీవు చేసిన నిర్వాకం. వాడి రెక్క పుచ్చుకుని బర బరా వంటింట్లోకి లాక్కుపోయింది. బిత్తర పోయి చూశాడు సాయి. వాడి మత్తు కాస్తా దిగిపోయింది. వంటిల్లంతా చెల్లా చెదరయిన అన్నం, ఒలికిపోయి అలుక్కుపోయిన పులుసు, చారు.... మూలకు గిన్నె దొర్లుతూంది. పెరటి వాకిలి తలుపు తెరచివుంది. కోతే వచ్చిందో....మరి కుక్కే వచ్చిందో....

'ఫట్' నెత్తిమీద మొట్టికాయ.

గిర్రున కళ్ళలో నీళ్ళు తిరిగాయి సాయికి.

గొంతులోంచి దుఃఖం బయటకి రాలేక లోలోపలే వుండలు చుట్టుకు పోతోంది.

వాడి దుఃఖం అత్త కొడుతున్నందుకు కానే కాదు. యిప్పుడో, యింకాసేపట్లో నయినా తినకపోతామా అని ఆకలితో ఆశతో అవురావురుమంటూ ఎదురు చూసిన భోజనం నేలపాలయి పోయింది.

"గుండ్రాయిలా కూర్చుని వుంటే యింకా యిక్కడేదో చదువు వెలగబెడుతున్నా వనుకున్నాను గానీ శయనోత్సవంలో వున్నారు దొరగారనుకోలే. ఈ దరిద్రం ముఖానికి తోడు వెధవ నిద్ర వొకటి వేళా పాళా లేకుండా....

"బంగారంలాంటి అన్నం .... కూరలు ...."

వంటింట్లోంచి శరపరంపరలా దూసుకువస్తున్న మాటలకు యింక ఆగలేనట్టు దుఃఖం పొంగి పొంగి వస్తోంది. తల మీద అత్త మొట్టినచోటు పచ్చి పుండులా వుండి నెప్పిగా వుంది. ఆకలి చచ్చిపోయినట్టు అనిపించింది వాడికా క్షణంలో.... కాని ఏడవటానికి కూడా శక్తిలేనట్టు నీరసం. దిగులుగా ఏడుపు బిగబట్టుకుంటున్నట్టుగా గోడకి చేరగిలబడ్డాడు సాయి.

కళ్ళలో తిరుగుతున్న నీళ్ళతోపాటు వాడి చిన్న బుర్రలో గిర్రున తిరుగుతున్న ప్రశ్నలు.

వంటింట్లో అలా అన్నం కూరలు పాడవటానికి తను బాధ్యుడా. తన నిద్ర (అది నిద్రే అయితే) ఎంతవరకు కారణం? పెరటి తలుపు గానీ వంటింటి తలుపులు గానీ మూయకుండా అలా తెరిచి పెట్టేసి, వీధిలో పిచ్చాపాటికి కూర్చున్న అత్త యిందుకు ఏ విధంగానూ కారకురాలు కాదా! పోనీ 'చూస్తుండు' అని తనతో ఒక్క మాటయినా చెప్పి వెళ్ళిందా? ఈ ప్రశ్నలన్నీ ఎక్కడ పుడుతున్నాయో అక్కడే చచ్చిపోయాయి. వాటికి బ్రతికి బయటపడే ధైర్యంలేదు. అలా జరిగితే వాటికి సమాధానాలు మాటల్లో కాదు దెబ్బల లోనే తనకు దొరికేది అని తెలుసు సాయికి. "ఇంతకి యిప్పుడు అత్త ఏం చేస్తుంది? మళ్ళీ అన్నం వండుతుందా? అబ్బ మళ్ళీ వండాలంటే యింకో గంట పడుతుంది. తను యిప్పటికే తాళలేకున్నాడు. మొదలెట్టిందో? లేదో? యింకా...."

వంటింటి దగ్గరకు వెళ్ళి ఆవిడ ఏం చేస్తుందో చూసే గుండె ధైర్యం లేదు సాయికి. 'ఒకవేళ వండినా తనకూ పెడుతుందా....'

ఈ అనుమానం వచ్చేసరికి వాడి గుండె గుభేలుమంది. కాళ్లూ చేతులూ మరింత చచ్చుబడినట్లు ఒళ్ళంతా నిస్సత్తువ ఆవరించేసింది.

'ఒకవేళ ఆ కోతో.... కుక్కో పుణ్యమాని.... తనకు యీ వేళ పస్తు అయితే....'

వంటింట్లోంచి పోపు వాసన, చుయ్ మంటూ నీళ్ళమోత వినబడింది. వాడి ఆశ రెపరెపలాడింది.

కాసేపట్లో వుప్మా వాసన వచ్చి వాడి నాసికాపుటాలకి సోకింది. ఉషారు వచ్చింది సాయికి. అత్త భలే తెలివయిన పని చేస్తోంది. వంటవుతే మళ్ళీ అన్నీ వండాలంటే ఎంతాలశ్యం." ఉప్మా అయితే నిమిషం.

అలాంటి నిముషాలు ఎన్ని గడిచినా పిలువు రాలేదు సాయికి. వాడు ఆతురతతో కాచుకునే వున్నాడు. ఏమయితేనేం కాసేపట్లో వచ్చింది. పిలుపు కాదు జగదాంబ.

ఆత్రంగా....ఆశగా అత్తముఖంలోకి చూశాడు.

"ఏం....అలా గుడ్లు మిటకరించి చూస్తావు. వెధవా చేశావుగా నిర్వాకం. యివాళ నీకు తిండిలేదు. నీ కదే శాస్తి. అప్పుడప్పుడూ మాడుస్తుంటే గానీ నీకు ఒంటిమీద స్మారకం వుండదు. మూడు పూటలా మేపుతుంటే ఒళ్ళు బలిసి...."

'ధ్రేవు' మని త్రేన్పుతో పాటు 'భడీ' మని వంటింటి తలుపు చేరవేసింది. సాయిలో కూడదీసుకుంటున్న ఆశలు కుప్పగా కూలిపోయాయి. వాడి గుండెలు జారిపోయాయి. దీనంగా అత్తకేసి చూశాడు వాడు. జగదాంబ అసలు వాడివంక చూడనేలేదు. వాడి కళ్ళు చెరువులయ్యాయి. అక్కడే గూట్లోవున్న భరిణ మూతతీసి వక్కపొడి తీసి నోట్లో వేసుకుంటూ విసవిసా వీధి వరండాలోకి వెళ్ళింది. అక్కడున్న చాపతీసి ముమ్మారు విదిలించుకుని దాని మీద వాలిపోయింది.

అత్త వెళ్ళి అలా పడుకోడం చూడగానే వాడి ఆశలు అడుగంటి

పోయాయి. వాడి కళ్ళల్లోని చెరువులు గండ్లుపడి ప్రవాహాలయ్యాయి. కూర్చో లేక అలాగే గోడనానుకుని ప్రక్కకు ఒరిగిపోయాడు సాయి. వాడి గుండెల్లోంచి ఏడుపు తన్నుకు వస్తోంది....'అమ్మ' ఆ కన్నీటి తెరల్లో కదలాడుతోంది.


కడుపులో ఆకలి, ఒంట్లో నీరసం.... వాడికి నిద్దరయినా పట్టలేదు. వీధి వ రం డా లో ం చి బావురుపిల్లులు పోట్లాడుతున్నట్టు జగదాంబ గురక వినిపిస్తోంది.

సాయి మెల్లగా లేచి నిలబడ్డాడు. వెళ్ళి అత్త పాదాలు పట్టుకుని క్షమాపణ కోరుకోవాలి. తనకేదయినా తింటానికి పెట్టమని అడగాలి. తన కడుపులో యీ క్షణం ఏదో ఒకటి పడితేకాని....

గురకలు తీస్తున్న అత్తని నిద్రలో లేపాలంటే భయంవేసింది వాడికి. ఏమంటుందో....అయినా వున్న మిగిలించిందో లేదో.... చూస్తే .... పిల్లిలాగా నడిచి గడియతీసి వంటింట్లోకి వచ్చాడు. ఎక్కడా, ఏ గిన్నెలు మూతతీసి చూడకుండానే వాడికి క్షణంలో అర్థమయిపోయింది. వంటింట్లో తూము దగ్గరగా పడేసివున్న అంట్లలో వున్న చిన్న వుప్మాగిన్నె సాయిని చూసి వెక్కిరించింది.

'అమ్మా.... అమ్మా....'సాయి గుండె లేని అమ్మకోసం, రాలేని అమ్మకోసం ఆక్రోశించింది. వాడి కళ్ళలో నీళ్ళు పొంగాయి. గొంతులోంచి తన్నుకొస్తున్న ఏడుపుని బిగబట్టుకుని మెల్లిగా తలుపు గడియ వేసుకుని యివతలికి వచ్చాడు. వరండాదాకా వెళ్ళి ఒక్కసారి అత్తకేసి చూశాడు. 'రాక్షసి....పిశాచి'....

వాడి పెదవులు వుచ్చరించిన పదాలు బయటికి రాలేదుగానీ ఆ అనడంలో వాడి కసంతా ముఖంలో పొంగింది. అంతకన్నా వాడేం చేయలేకపోయాడు ఆ సాయంత్రం.



'ఒరేయ్ వాసూ! యిలారా నాయనా. ఇదిగో యీ పావలా పట్టుకెళ్ళి మరమరాలు తెచ్చిపెడతావూ!'

ఎదురింటి వాసు అత్త చేతిలోంచి పావలా, సంచీ తీసుకుని రివ్వున వెళ్లాడు. అలా చూస్తూ వుండిపోయిన సాయి మనసులో ఏదేదో ఆలోచన.

'అత్తయ్య తనకెందుకు చెప్పలేదు, మరమరాలు తెమ్మని? వాసూకే ఎందుకు చెప్పింది?'

సాయి బుర్రకు రాత్రికిగానీ ఆ విషయం తట్టలేదు.

ఆ రాత్రికి జగదాంబ అన్నం వండలేదు. టిఫినూ చేయలేదు. పళ్ళెంలో మరమరాలు గుమ్మరించుకుని యింత వుప్పూ, కారం, నెయ్యివేసి కలుపుకుని తినేసి రెండుచెంబుల నీళ్ళు తాగింది. బ్రేవ్‌మని త్రేన్చింది.

దీపంముందు పుస్తకం పట్టుకుని కూచున్నాడేగానీ సాయి కడుపులో ఎలకలు పరుగెడుతున్నాయి. వాడి చూపులు వంటింటికేసే వున్నాయి.

"ఎందుకలా దెయ్యంలా చూస్తావు దిష్టిగొట్టుకు పొమ్మని. నీ కివాల ఏం పెట్టనన్నానా? యివాళేకాదు రేపు అంతే. మీ మామయ్య వచ్చాకే నీ సంగతి. వెధవన్నర వెధవా. అంత భయంలేదురా నీకు. రెండురోజులు తిండిలేకుండా నీలగదీస్తేగానీ బుద్ధిరాదు భడవా."

వంటింటి తలుపులు భడాలున మూసుకుని విసవిసా సాయిదగ్గరకు వచ్చింది.

దెబ్బతిన్న కుక్కపిల్లలా దీనంగా చూశాడు సాయి అత్తకేసి.

"అత్తా! యింకెప్పుడూ ఏమరి వుండను. నాకు నాకు ఆకలివేస్తుందత్తా. కడుపులో ఎలాగో...."

వాడు మాట పూర్తిచేయనేలేదు. వురిమి చూసింది. "ఇకచాల్లే నీ చదువు, దీపమొకటి దండగ" అంటూ లాంతరు తీసుకుని వరండాలోకి వెళ్ళిపోయింది, తన పక్కదగ్గరికి.

సాయికి దుఃఖం తెరలు తెరలుగా వచ్చింది. నెమ్మదిగా లేచి తన పడక పరుచుకుని వాలిపోయాడు. నిద్ర రావటం లేదు. వాడి కడుపు కాలిపోతోంది. మనసు కాలిపోతోంది. ఏదేదో చేసేయాలని వుంది ఆ క్షణం.

'దొంగతనం చేసి ఏదయినా తినేసి వస్తే....'

'ఎవరినయినా అడుక్కుని పట్టెడన్నం పెట్టించుకు తింటే '

'ఛీ....ఛీ....తనను తానే నిందించుకున్నాడు. రేపు కూడా పెట్టదట. మామయ్య రేపు వచ్చేస్తే బావుండును. లేకపోతే తను చచ్చిపోడూ?'

'అమ్మా....అమ్మా....ఎక్కడున్నావే....ఆకలవుతోంది. పొట్టలో ఎలాగో వుందే....వాంతి వచ్చేలా వుంది. కాళ్ళు గుంజుతున్నాయమ్మా....అమ్మా....ఇలా మాడ్చేబదులు నన్నూ నీతో తీసుకుపోయి వుండకూడదూ .... ఒక్కసారి.... యీ ఒక్కసారికి ఎలాగయినా సరే నాకు భోజనం దొరికేటట్లు చేయవూ....అమ్మా....అ....మ్మా....'

వాడి ఆక్రందన వాడి అమ్మకు వినబడిందో లేదోగాని నిద్రాదేవికి మాత్రం జాలేసి వాడిని కావలించుకుంది.

ఉదయం మెలకువరాగానే సాయి పక్కమీదినుంచి లేవబోయాడు. కాని కాళ్ళు తేలిపోతున్నట్లు అనిపించింది. ఒళ్ళు నీరసంతో తూలిపోతోంది. 'ఇంత పొద్దెక్కినా లేవలేదని' మళ్ళీ అత్తయ్యతో చీవాట్లు తినాలి. శక్తి కూడదీసుకుని లేచాడు. పెరట్లో జగదాంబ నూతి దగ్గర స్నానంచేస్తోంది. బొగ్గు తెచ్చుకుని వీధి అరుగుమీద కూర్చుని పళ్ళు తోమసాగాడు. నోట్లో వేలు పెడితే వాంతి వచ్చేలా వుంది వాడికి.

"సాయీ....సాయీ....మీమామయ్య వున్నాడా యింట్లో"

పంతులుగారి అబ్బాయి సైకిల్లోంచి దిగకనే ఓ కాలు నేలమీద ఆన్చి అడిగాడు.

"లేడు. ఏం?"

"ఇవాళ మా యింట్లో మా అమ్మగారి తద్దినం. బ్రాహ్మణార్థం రమ్మని మీ మామయ్యకు చెప్పమన్నారు నాన్న. మీ మామయ్య ఇంకాసేపట్లో వచ్చేస్తాడా, అసలెక్కడికి వెళ్లాడు?"

సాయి ఏదో చెప్పబోయాడు. కానీ మరేదో ఆలోచన రావడంతో వాడికళ్ళు తళుక్కున మెరిశాయి రెప్పపాటుకాలం. లోపలికి తొంగిచూశాడు.

'మా అత్తను అడిగి వస్తానుండు'

సాయి ఇంట్లోకి వెళ్లాడు. జగదాంబ తడి చీరతో తులసికోటకు ప్రదక్షిణలు చేస్తోంది. సాయి రెండు క్షణాల్లో బయటికి వచ్చాడు.

"ఎక్కడికో వెళ్లారుట. యింకాసేపట్లో వచ్చేస్తాడంది," మెల్లగా అన్నాడు.

"రైట్. రాగానే యీ సంగతిచెప్పు. తప్పక పదిగంటలకి వచ్చేయమనాలి. ఎదురు చూస్తుంటారు నాన్నగారు."

తుర్రున వెళ్ళిపోయాడా అబ్బాయి. సాయి కళ్ళు భయంతో రెపరెపలాడాయి. గుండెలు దడదడ కొట్టుకున్నాయి. కాని ఏదో ఆశతో సంతోషం చోటుచేసుకుంటోంది మనసులో. ఒంట్లోకి లేని హుషారు తెచ్చుకున్నాడు. తెచ్చుకున్న ఆ హుషారును కప్పిపెట్టుకున్నాడు. గబగబా పనులన్నీ కానిచ్చాడు.

పూజ ముగించేసి జగదాంబ సూర్య నమస్కారాలు ప్రారంభించింది.

సాయి పిల్లిలా వంట యింట్లోకి వెళ్ళాడు. దేవుడి అరుగు ప్రక్కనే వున్న గూట్లో చేయిపెట్టి వెదికాడు. క్షణంలో గుప్పిట మూసుకుని బయటికి వచ్చాడు. అత్త ఏమయినా తిని పొమ్మంటుందనే ఆశలేదు. అసలు తినడానికి ఏమయినా వుంటేనా!

'అత్తా! స్కూలుకు వెడుతున్నాను,' సంచీ భుజానికి తగిలించుకుని నీరసంగా బయలుదేరాడు.

సాయి ఏదయితే జరగదేమోనని నిరాశ చెందుతున్నది ఏ ఆటంకము రాకుండా జరిగిపోయింది. ఏదయితే జరగకూడదని వెయ్యి దేవుళ్ళకి మొక్కుకున్నాడో అదేజరిగిపోయింది. ఆ తరవాత....

ఆ తరవాత జరిగిందే భోజనం చేస్తున్న రామశాస్త్రికి వివరిస్తోంది జగదాంబ. వాడు చేసిన అపరాధం ఆకాశమంత పెంచి, తను విధించిన శిక్ష ఆవగింజంత పరిణామానికి తెచ్చి.

ఇంతకీ ఆ తరువాత జరిగింది....

ఆ సాయంత్రం స్కూలునుంచి వచ్చేసరికి వరండాలో నుంచుని యిటూ అటూ పచార్లు చేస్తున్న అత్తను చూసి సాయి కాళ్ళు గడగడా వణికాయి. మహంకాళిలా మీదికి వురికింది. వాడి రెక్కపుచ్చుకుని లోపలికి యీడ్చుకొచ్చింది. భుజానవున్న సంచి పీకి అవతల పారేసింది. వీపు వంగదీసి చొక్కా పైకెత్తి చూసింది. అంతే వీపు మీద పిడికిలితో దభీదభీమని ప్రమోదింది. జుట్టు పట్టుకుని ఆ చెంపా యీ చెంపా వాయించింది. చేతులు నొప్పెట్టేదాకా, ఎడాపెడా తగులుతున్న దెబ్బలను తన చిన్నచేతులతో కాచుకో లేకపోయాడు సాయి. గుక్క తిప్పుకో లేక పోయాడు. ఏదో చెప్పాలని పెదవులు కదిలించబోయాడు. 'ఫెడీ' మని తగిలిన దెబ్బకి పెదవులు రక్తం చిమ్మాయి.

చప్పున కిందికి జారిపోయి అత్త కాళ్ళకి చుట్టేసుకున్నాడు. పురుగుని విదిలించినట్టు ఒక్క విదిలింపు విదిలించింది జగదాంబ. ఆ విసురుకి తలుపుకివెళ్ళి గుద్దుకున్నాడు. నుదురు తాకి బొళబొళా రక్తంకారింది

'-త్తా యింక కొట్టకు' అన్నట్టు చేతికంటుకున్న నెత్తురు చూసి, అత్తకేసి చూశాడు.

అప్పుడు నోరు విప్పింది జగదాంబ.

"బ్రాహ్మణార్థం వెడతావురా వెధవ కానా! వేలెడు లేవు! నీ కెన్ని వుపాయాలున్నాయిరా. అవ్వ.... అవ్వ........ భోక్తగా వెడితే కమ్మగా భోంచేయవచ్చనని....తిండికంత ఛస్తున్నావురా.... గూట్లోవున్న పాతజంధ్యంతీసి తగిలించుకోగానే నీకా అర్హత వచ్చేస్తుందనుకున్నావా! ఓరి అప్రాచ్యుడా. ఎంతపని

చేశావురా. ఎంత అవమానం.... ఎంత సిగ్గుచేటు....ఛీ....ఛీ...."

ఇంతకీ యిదెలా జరిగిందీ అంటే—

ఆ సాయంత్రం జగదాంబ మంచి నీళ్ళకి బావికి వెళ్ళింది. పంతులుగారి భార్య నీళ్ళకి వచ్చింది.


"వదినా! మీ వారికి వంట్లో బావుండ లేదుట కదా! ఏమయింది. యింటికి రావటమే నలతగా వచ్చారట కదా. మాకు యిబ్బంది అవకూడదని మీ మేనల్లుడిని పంపించారట. చాలా సంతోషం వదినా. లేకపోతే ఈ వూళ్ళో యిప్పటికిప్పుడు బ్రాహ్మలు దొరకాలంటే మాటలా. అబ్బాయి ముచ్చటగా వున్నాడు. ఎంత కుదురుగా భోజనం చేశాడని. అన్నట్టు మీ మేనల్లుడికి వుపనయనం అయినట్టే తెలియదు మాకు. మొన్న షష్టి పెట్టాలనుకున్నాను. బ్రహ్మచారి ఎవరా అని...."

ఆవిడ మాటలు జగదాంబ పాదాల కింద నిప్పులు పోసినట్టయ్యాయి. ఇల్లు ఎలా చేరిందో తనకే తెలీదు.

సాయి వచ్చేవరకు కాలుగాలిన పిల్లిలా తిరిగింది. బెబ్బులిలా హుంకరించింది. పాములా బుసలు కొట్టింది.

సాయి వచ్చాడు.

బెబ్బులి లంఘించింది. పాము పడగ విప్పింది. సాయి ఒళ్ళు తెలీకుండా పడిపోయాడు.



అన్నం పెట్టి మజ్జిగవేసింది జగదాంబ.

"ఎంత అప్రతిష్ట ఎవరికైనా తెలిస్తే. ఎంత అపచారం అసలు. వాళ్ళింట్లో తద్దినం మంటగలిపాడు అప్రాచ్యుడు. తిండికి ముఖంవాచి ఛస్తున్నాడా అని..."

భోజనం చేస్తున్నంత సేపూ జగదాంబ నోటినుండి వస్తున్న ఒక్కో మాటనే గరళంలా మింగాడు రామశాస్త్రి. ఆయనకి కోపం రావటం లేదు. గుండె కరుడు గట్టటానికి బదులు ద్రవిస్తోంది 'సాయీ సాయీ' అతనిహృదయం ఆక్రోశిస్తోంది.

"అత్త....అ...త్త...కొట్టొద్దత్త.... యింకెప్పుడూ అట్లా చేయనత్తా....అమ్మ అమ్మా....ఆకలేస్తోందే....నేను తట్టుకో లేకున్నానే.. అమ్మా....నన్నూ.... నీతో తీసికానిపోయి వుండకూడదూ....అమ్మా నీతో వచ్చేస్తానే....అమ్మా...."

దిగ్గున లేచాడు రామశాస్త్రి. సాయి జ్వరంలో కలవరిస్తున్నాడు. వాడి కలవరింతలు అతని గుండెలు చీలుస్తున్నాయి. చీలుతున్న ఆ గుండెల్లోంచి అనురాగ స్రవంతి పొంగుతోంది.... పొంగి ప్రవహించసాగింది.

"సాయీ....నాయనా.... సాయీ .. రెండు చేతులతో సాయిని చుట్టేశాడు. "నాయనా సాయీ యిట్లా చూడరా .... నేనురా .... మామను .... కళ్ళు తెరిచి ఒకసారి చూడు నాయనా....అరిచేతుల్లోకి వాడి ముఖాన్నితీసుకుని ముఖంలో ముఖం పెట్టి పిలిచాడు. మేనమామ గొంతు విని మెల్లగా కళ్ళువిప్పాడు సాయి. వాడి కళ్ళు చుట్టూ ఓసారి పరికించి చూశాయి. దరిదాపుల్లో వాడికెక్కడా అత్త కనిపించ లేదు. మామకేసి చూసి రెండుచేతులూ జోడించాడు సాయి. అతి కష్టంమీద గొంతు పెగుల్చుకున్నాడు. వాడి గుండెల్లోని బాధంతా కరుగుతోంది. నీరుగామారి కళ్ళవెంబడి ధారలు కట్టింది.

"మామయ్యా .... తప్పు చేశాను మామయ్యా. వంటంతా కుక్క తిని పోయిందని....అత్త అన్నంగానీ ఉప్మా




గానీ చివరకు మరమరాలుగానీ పెట్టలేదు మామయ్యా. రెండురోజులు కడుపులో ఏంలేకపోయేసరికి ఆకలికి తట్టుకోలేక పోయాను. చచ్చిపోతానని భయం వేసింది. మీకు ఒంట్లో బాగాలేక నన్ను పంపించారని చెప్పి పాత బంధ్యం తీసుకుని వెళ్లాను పంతులుగారింటికి. తప్పని తెలుసు. అది అపచారమనీ తెలుసు మామయ్యా. కాని కాని....నా కప్పుడు ఏంతోచలేదు. 'భోజనం కావాలి' అంతే....ఆ దింట్లో ఏం చేస్తున్నదీ నాకే తెలీక....మామయ్యా నీకెప్పుడూ ఏమీ చెప్పలేదు. కానీ .... ఇప్పుడు అత్తతో కొట్టొద్దని చెప్పు మామయ్యా .... అబ్బా అమ్మా."

మధ్యమధ్య వెక్కుతూ ప్రవాహంలా వచ్చే దుఃఖాన్ని అణుచుకుంటూ సాయి చెబుతున్నాడు. ఒక్కోమాట శాస్త్రి గుండెల్ని చీలుస్తున్నాయి. ఆయన కళ్ళు వర్షిస్తున్నాయి.

"నాయనా సాయీ" వీపుమీద చేయి వేసి రాశారు. 'అమ్మో' అన్నాడు సాయి, కంగారుగా రామశాస్త్రి దూరంగా వున్న లాంతరు తీసుకొచ్చి వత్తి పెద్దది చేశాడు. ఆ వెలుగులో వాడి ఒళ్ళంతా చూసేసరికి రామశాస్త్రికి తన గుండెను ఎవరో గునపంతో పెళ్ళగిస్తున్నట్లు బాధ కలిగింది. ఆయన కడుపు తరుక్కు పోయింది.

"నాయనా ....సాయీ....ఎంత శిక్ష అనుభవించావురా కడుపు చూసి అన్నం పెట్టలేని ఆడదే కాదురా మీ అత్త, కడుపు కాల్చి వాతలు వేసే బ్రహ్మ రాక్షసి. ఈవేళ పంతులుగారింట్లో నీకు భోజనం పితృదేవలకు అపచారం కిందికి రాదు నాయనా. అన్నంకోసం అలమటించిపోయిన నీవు తృప్తిగా భోంచేసినందుకు పైనుంచి విన్నా, నీకు భోజనం పెట్టినవాళ్ళను కూడా ఆశీర్వదించి వుంటారురా వాళ్ళు. తద్దినం పెట్టించుకుందే పంతులుగారి భార్య, పిల్లలు గలిగిన చల్లని తల్లిరా. అలాంటి తల్లి, తల్లిని పోగొట్టుకున్న నీవు ఆకలితో అలమటించి వచ్చి భోంచేసినందుకు సంతోషించే వుంటుంది నాయనా. వాళ్ళని శపించదు. మనసారా తృప్తిపడి ఆశీర్వాదమే చేసివుంటారు. నిజంరా సాయీ.... ఇది నిజం....సాయీ నన్ను క్షమించు నాయనా. నేను పెట్టలేకపోయినా భోజనం పెట్టేచోట్లు చూపిస్తానురా నీకు. రేపే మంచిరోజు చూసి నీకు ఉపనయనం చేస్తాను.అన్ని కార్యాలకు నాకు బదులుగా నిన్నే పంపుతాను. అందుకు తగ్గ విద్య రేపే ప్రారంభం చేస్తాను నాయనా నీకు. ఎక్కడో ఓ చోట, ఎప్పుడో ఓ రోజయినా నీవు తృప్తిగా భోంచేయగలవురా. నాయనా సాయీ.... తెల్లవారనీ .... నీ జ్వరం తగ్గిపోతుంది. నీకు బ్రతుకుబాట చూపిస్తాను...."

ఇన్ని మాటల్లో సాయికి అర్థమయింది 'తనదేం అపచారం కాదని' మాత్రమే.

రామశాస్త్రి కన్నీళ్ళు ఎంతసేపో సాయి తలని తడుపుతూనే వున్నాయి.

